సాక్షి
అనంతపురం

సోమవారం ౹ 5 ౹ జూన్ ౹ 2023



నగరంలో చైన్ స్నాచింగ్

అనంతపురంలో ఆదివారం తెల్లవారుజామున మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగుడు లాక్కెళ్లాడు. 8లో



అభ్యసనతోనే విజయం సొంతం

ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ, సాక్షి మీడియా గ్రూపు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలో గ్రూప్‌–2 పోటీ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించాయి. 8లో

గరిష్టం/కనిష్టం
40.9°/24.2°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి సాయంత్రం ఆకాశం మేఘావృతమైంది. నైరుతి నుంచి వాయువ్యం దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నృసింహునికి చింతపూల ఉత్సవం



తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్న ఖాద్రీశుడు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి చింతపూల ఉత్సవం వైభవంగా జరిగింది. కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం ఏడు గంటలకు అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆలయం నుంచి మున్సిపాలిటీ పరిధిలోని తుమ్మలరోడ్డు కుంతీ తీర్థం దగ్గర శ్రీదేవి భూదేవి సమేత ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని చింతపూల మంటపం వద్దకు తీసుకెళ్లి ఉత్సవం నిర్వహించారు. అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు తిరువీధుల్లో స్వామివార్లను ఊరేగించారు. వాల్మీకి మశాల్తి నారాయణ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి నరసింహస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఈట శ్రీనివాసరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటిక



నాటికలోని సన్నివేశం

ప్రశాంతి నిలయం: 'ఉత్తిష్ట జాగ్రతా ప్రపయా వరణ్ నిభోదతా' పేరుతో ప్రశాంతి నిలయంలో మధ్యప్రదేశ్‌కు చెందిన సత్యసాయి భక్తులు ఆదివారం నిర్వహించిన నాటిక భక్తులను ఆకట్టుకుంది. పర్తియాత్రలో భాగంగా రెండోరోజు సత్యసాయి మహాసమాధి చెంత మధ్యప్రదేశ్‌కు చెందిన సత్యసాయి యూత్ సభ్యులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష్యాన్ని సాధించే వరకూ పట్టుదల, వివేకాన్ని వదలకూడదన్న సందేశాన్నిచ్చేలా వివేకానందుడి బోధనల ఆధారంగా రూపొందించిన లఘు నాటికను ప్రదర్శించారు. అనంతరం కళాకారులను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర



ఆకట్టుకున్న హనుమాన్ విగ్రహం

పెనుకొండ: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం 'హనుమాన్ శోభాయాత్ర'ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేలాది మంది ప్రజలు, యువతీ యువకులు, మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు. 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న కృష్ణదేవరాయ జంక్షన్ నుంచి శోభాయాత్రను ప్రారంభించారు. దర్గా సర్కిల్, ఎన్‌టీఆర్ సర్కిల్, కృష్ణదేవరాయ సర్కిల్ మీదుగా భోగసముద్రం చెరువు వరకు యాత్ర సాగింది. కార్యక్రమంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర సభ్యులు విశ్వప్రసన్న తీర్థ స్వామి పాల్గొన్నారు. స్థానిక వీహెచ్‌పీ నాయకులు ఆయనను వెండి రథంపై హనుమాన్ విగ్రహాలతో పాటు ఊరేగించారు.

2024లోనూ విజయం మనదే

- విజయోత్సవ సభకు విచ్చేసిన జనమే నిదర్శనం
- మేనిఫెస్టోలో 98.44 శాతం హామీలు అమలు చేశాం
- కళ్యాణదుర్గం నియోజకవర్గంలో రూ.4,718 కోట్లతో అభివృద్ధి
- అభినవ అంబేడ్కర్, పూలే, కొమరం భీమ్‌గా సీఎం వైఎస్ జగన్
- సంక్షేమ పాలనను ఓర్వలేక ప్రతిపక్షం, ఎల్లో మీడియా దుష్ప్రచారం
- ప్రజలను మరోసారి మోసం చేసేందుకు మేనిఫెస్టోతో చంద్రబాబు కుట్ర
- 'గడప గడపకూ మన ప్రభుత్వం' ముగింపు సభలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్



విజయోత్సవ సభకు తరలివచ్చిన అశేష జనం

కళ్యాణదుర్గం: 'అభివృద్ధి – సంక్షేమం రెండు కళ్లుగా జగన్ సర్కార్ పాలన సాగుతోంది. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయి. సచివాలయ – వలంటీర్ వ్యవస్థతో ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు తీసుకొచ్చింది' అని మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్ అన్నారు. ప్రభుత్వ పాలన ఎలా ఉందో తెలుసుకోవడానికి, సమస్యలు ఇంకా ఏమైనా ఉంటే గుర్తించి పరిష్కరించడానికి చేపట్టిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం రాయలసీమలో వంద శాతం పూర్తి చేసిన నియోజకవర్గంగా కళ్యాణదుర్గం నిలిచింది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమ ముగింపుతో పాటు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం కళ్యాణదుర్గంలో మంత్రి కె.వి.ఉషశ్రీచరణ్ అధ్యక్షతన విజయోత్సవ సభ నిర్వహించారు. కనీవినీ ఎరుగని రీతిలో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు తరలివచ్చారు. ఈ విజయోత్సవ సభే 2024 ఎన్నికలకు విజయ సూచిక అని ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో జరిగిన సంక్షేమం...అభివృద్ధి గీటురాళ్లుగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. మంత్రి పెద్దిరెడ్డితో పాటు ఎమ్మెల్సీ మంగమ్మ, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిశీలకుడు ఎంఆర్‌సీ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రెండు పేజీల మేనిఫెస్టోలోని హామీల్లో 98.44 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీత లాంటి పవిత్ర గ్రంథంగా భావించి అమలు చేశారన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు 600 హామీలను వంద పేజీలతో విడుదల చేసిన మేనిఫెస్టోను అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా విస్మరించారన్నారు. ఇటీవల నిర్వహించిన మహానాడు వేదికగా తాము అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికీ ట్రాక్టర్, బంగారం ఇస్తామంటూ మేనిఫెస్టో ప్రకటించారన్నారు. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు కుట్ర పన్నారని విమర్శించారు. ప్రజలకు ఎవరి పాలనలో ఎంత మేలు జరిగిందో బేరీజు వేసుకోవాలన్నారు. సంక్షేమ – జనరంజక పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీకి వచ్చే ఎన్నికల్లో మరోసారి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, చిత్రంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, పైలా నరసింహయ్య

సంక్షేమాన్ని ఓర్వలేని ప్రతిపక్షం..

ప్రజా సంకల్పయాత్రలో వివిధ వర్గాల ప్రజలు పడుతున్న కష్టాలను వైఎస్ జగన్ గుర్తించి.. వారిని గట్టెక్కించడానికి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టినవే 'నవరత్నాలు' పథకాలని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. జగనన్న పాలనలో దేశంలోనే ఏపీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. నవ్యాంధ్ర నిర్మాణం కోసం యువత, మహిళలకు సింహభాగం నిధులు కేటాయిస్తూ డీబీటీ పద్ధతిలో పథకాలు అందిస్తున్నారని చెప్పారు. జిల్లాల పునర్విభజన, జీ20 సమ్మిట్, 340 ఎంఓయూలు, 3 కారిడార్‌లు, 9 ఫిషింగ్ హార్బర్‌లతో అభివృద్ధి వైపు రాష్ట్రం ముందుకెళ్తోందన్నారు. అమరావతి పరిసర ప్రాంతాల్లో ఏకంగా 50 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలిచ్చారని కొనియాడారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో నాలుగేళ్ల పాలనలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించామని మంత్రి స్పష్టంచేశారు. సంక్షేమ పథకాలతో 8,87,989 మంది లబ్ధిదారులకు ఏకంగా రూ.3,518 కోట్లు ఖర్చు చేయగా, అభివృద్ధి కార్యక్రమాల కింద 55,973 పనులకు రూ.1,200 కోట్లను మొత్తం మీద రూ.4,718 కోట్లను తమ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్నింటా సగభాగం కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్.. అభినవ అంబేడ్కర్, పూలే, కొమరం భీమ్‌గా నిలిచారని కొనియాడారు. నియోజకవర్గంలో బీటీపీ ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమాన్ని చూసి ప్రతిపక్ష టీడీపీ ఓర్వలేకపోతోందని మండిపడ్డారు. ఎల్లోమీడియా ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. కర్ణాటకలోని బీజేపీ, కాంగ్రెస్ హామీలలో కొన్నింటిని కాపీ కొట్టి చంద్రబాబు మేనిఫెస్టో తీసుకొచ్చాడని విమర్శించారు. ప్రజలు అబద్ధాల బాబును నమ్మకుండా జనరంజక పాలన కోసం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. విజయోత్సవ సభ వేదిక నుంచే వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేందుకు మంత్రి సమర శంఖం పూరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

టీడీపీ అధినేత చంద్రబాబు గిమ్మిక్కుల మేనిఫెస్టోతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ మంగమ్మ సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే మేనిఫెస్టో ద్వారా మాయ చేయాలని చూస్తున్నాడని అన్నారు. మంత్రి ఉషశ్రీచరణ్ ఉక్కు మనిషని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి కొనియాడారు. ఎన్ని అడ్డంకులు ఎదురొచ్చినా తన పోరాట శక్తితో ఎదుర్కొని ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు.

ఎండోమెంట్ సహాయ కమిషనర్‌గా ఆదిశేషునాయుడు



ఆదిశేషు నాయుడు

అనంతపురం కల్చరల్: జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ నూతన సహాయ కమిషనర్‌(ఏసీ)గా ఆదిశేషునాయుడు నియమితులయ్యారు. ఇక్కడ ఏసీగా పనిచేస్తున్న రామాంజనేయులు కర్నూలుకు బదిలీ అయ్యారు. అక్కడ ఏసీగా ఉన్న ఆదిశేషునాయుడు అనంతపురానికి బదిలీపై వస్తున్నారు. బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు నూతన ఏసీ ఆదిశేషునాయుడు తెలిపారు.

వెబ్‌సైట్‌లో టీచర్ల సీనియార్టీ జాబితా

రాప్తాడు రూరల్: ప్రభుత్వ టీచర్ల బదిలీలకు సంబంధించిన తుది సీనియార్టీ జాబితా అధికారికంగా వెబ్‌సైట్‌లో ఉంచారు. ప్రొవిజనల్ సీనియార్టీ జాబితాలపై వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి శనివారం అర్ధరాత్రి తుది జాబితాలను అందుబాటులో ఉంచారు. అయితే కొన్ని అభ్యంతరాలను పరిష్కరించకుండానే ఫైనల్ జాబితాలను ప్రకటించారంటూ కొందరు టీచర్లు విద్యాశాఖ అధికారి సాయిరామ్‌కు ఫిర్యాదులు చేశారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని డీఈఓ హామీ ఇచ్చారు. టీచర్ల ఖాళీలపై ఆదివారం అర్ధరాత్రి దాకా కసరత్తు చేశారు. ఉదయాన్నే ఖాళీలపై ప్రొవిజనల్ జాబితాలను డిప్యూటీ డీఈఓలు, మండల విద్యాశాఖ అధికారులకు పంపారు. వారితో క్షుణ్ణంగా పరిశీలించి నిర్ధారించుకున్న తర్వాతనే అధికారికంగా వెబ్‌సైట్‌లో ఉంచుతామని అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ అర్ధరాత్రి దాకా సాగింది. కాగా షెడ్యూలు ప్రకారం సోమవారం నుంచి వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంది. 5, 6 తేదీల్లో హెచ్‌ఎంలు, 5 నుంచి 7 వరకు స్కూల్ అసిస్టెంట్లు, 5 నుంచి 8 వరకు ఎస్జీటీలు ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశముంటుంది.

ఇంటర్ మార్కుల నమోదుకు నేడు తుది గడువు

అనంతపురం: ఏపీ ఈఏపీసెట్‌–2023లో ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు, ధ్రువపత్రాల అప్‌లోడ్‌కు సోమవారం తుదిగడువుగా నిర్దేశించినట్లు ఏపీ ఈఏపీసెట్‌–2023 రాష్ట్ర కన్వీనర్ శోభాబిందు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి నేరుగా మార్కులు ఏపీ ఈఏపీసెట్ సర్వర్‌కు అనుసంధానం చేశారు. దీంతో ఏపీలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన వారికి ఎలాంటి ఇబ్బందీ లేదు. అయితే తెలంగాణ ఇంటర్మీడియెట్, ఆర్‌జీకేయూటీ, ఓపెన్ స్కూల్ సిస్టమ్, సీబీఎస్‌ఈ పరీక్షలు పూర్తి చేసిన వారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు చేస్తూ, ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని కన్వీనర్ తెలిపారు.

ఎంసీఏకు యమ క్రేజ్

- సులువుగా సాఫ్ట్‌వేర్ కొలువులు
- కలిసి వస్తున్న కోర్సు కాల వ్యవధి
- విద్యార్థుల నుంచి విపరీతంగా పెరుగుతున్న డిమాండ్
- ఎంసీఏ సీట్ల కోసం ఇంజినీరింగ్ కళాశాలల దరఖాస్తులు





అనంతపురం: ఆకర్షణీయమైన జీతంతో లభించే సాఫ్ట్‌వేర్ కొలువులు దక్కించుకునేందుకు యువత ఎంసీఏ కోర్సులపై ఆసక్తి చూపుతోంది. గతంలో ఎంసీఏ కోర్సు కాల వ్యవధి మూడు సంవత్సరాలు ఉండేది. డిగ్రీ చేసిన అనంతరం తిరిగి మూడు సంవత్సరాలు వెచ్చించాలంటే చాలామంది ఎంసీఏ కోర్సుపై అనాసక్తత ప్రదర్శించేవారు. ఈ క్రమంలో రెండేళ్ల కాల వ్యవధి కలిగిన ఎంబీఏ కోర్సులు పూర్తి చేసేందుకు సుముఖత చూపేవారు. మరోవైపు ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కంప్యూటర్ సైన్సెస్ కోర్సులు చేసినవారికే ఎక్కువగా దక్కుతున్నాయి. దీంతో బీటెక్ (కంప్యూటర్ సైన్సెస్), వాటి అనుబంధ కోర్సులకు ప్రాధాన్యత దక్కింది. జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఒక్క కంప్యూటర్ సైన్సెస్ కోర్సుల్లోనే 3 వేల సీట్లు అదనంగా మంజూరు చేయాలని కోరడమే ఇందుకు నిదర్శనం. డిగ్రీ పూర్తి చేసిన వారు ఐసెట్ (ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) –2023 రాసి ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు ఎంపిక చేసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఎంసీఏ సీట్లు అందుబాటులోకి తేవడానికి అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలు పోటాపోటీగా దరఖాస్తు చేసుకుంటున్నాయి. ఒక్క రాయలసీమ పరిధిలోనే ఏకంగా 20 ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎంసీఏ కోర్సు నిర్వహించడానికి ఆసక్తి చూపడం ఇందుకు నిదర్శనం.

స్టాండ్‌లోన్ కళాశాలల కంటే..

ఇంజినీరింగ్ కాకుండా స్టాండ్‌లోన్ కళాశాలల్లో (ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు నిర్వహించే) ఎంసీఏ సీట్లు పెంపుదల చేస్తూ ఎంబీఏ సీట్లు తగ్గించుకుంటున్నాయి. స్టాండ్‌లోన్ కళాశాలలకు దీటుగా ఇంజినీరింగ్ కళాశాలల్లోనూ 2023–24 విద్యా సంవత్సరానికి ఎంసీఏ కోర్సులు అందుబాటులోకి తేవడానికి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాలు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ఈ మేరకు ఏఐసీటీఈ (ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) నుంచి అనుమతి తెచ్చుకుని జేఎన్‌టీయూ అనంతపురానికి దరఖాస్తు చేశాయి. మరో వైపు ఎంసీఏ కోర్సు గతంలో మూడు సంవత్సరాల కాల వ్యవధి ఉండేది. తాజాగా ఎంసీఏ కోర్సు కాల వ్యవధి రెండు సంవత్సరాలకు తగ్గించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఎంసీఏ కోర్సు పట్ల మొగ్గు చూపుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు దక్కుతున్న క్రమంలో ఎంబీఏ కంటే ఎంసీఏ మేలని విద్యార్థులు భావిస్తున్నారు. అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లోనూ ఎంసీఏ కోర్సు ప్రవేశపెట్టాలని పలు ఇంజినీరింగ్ కళాశాలలు దరఖాస్తు చేసినట్లు జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన తెలిపారు.

సబ్ స్టేషన్‌లో మందు పార్టీ





కణేకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మందు పార్టీ చేసుకుంటున్న దృశ్యం

- కాంట్రాక్టర్ నిర్వాకం
- 'ఫుల్లు'గా ఎంజాయ్ చేసిన సిబ్బంది

కణేకల్లు: కణేకల్లులోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం మందు పార్టీలకు అడ్డాగా మారింది. చీకటిపడితే చాలు మందు, విందుతో ఎంజాయ్ చేస్తున్నారు. ఇక్కడికి వచ్చేవారెవరు? అడిగే వారెవరన్న ధోరణి ఇక్కడి సిబ్బందిలో కన్పిస్తోంది. విద్యుత్ శాఖలో హైవోల్టేజీ డిస్ట్రిబ్యూషన్ సిస్టం (హెచ్‌వీడీఎస్) పనులు చేస్తున్న ఓ కాంట్రాక్టరు నిర్వాకంతో ఇక్కడ వారంలో రెండు, మూడు సార్లు మందు పార్టీలు జరుగుతున్నట్లు సమాచారం. తన కింద పని చేస్తున్న ప్రయివేటు వర్కర్లు, అనుకూలంగా ఉంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వర్తిస్తున్న లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్లకు రాత్రిపూట మందు పార్టీలు ఇస్తూ ఖుష్ చేస్తున్నాడు. దీంతో సబ్‌స్టేషన్ కాస్తా బార్ అండ్ రెస్టారెంట్‌గా మారిందన్న విమర్శలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. శనివారం రాత్రి జరిగిన మందు పార్టీలో సదరు కాంట్రాక్టరుతో పాటు లైన్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు, మరో ముగ్గురు ప్రయివేటు వర్కర్లు పాలు పంచుకున్నారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఉన్నతాధికారులతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని, తన మాటను ఎవరూ కాదనరంటూ సదరు కాంట్రాక్టరు ఇక్కడ పని చేసే అధికారులను సైతం గుప్పిట్లో పెట్టుకున్నట్లు సమాచారం. అలాగే మందు పార్టీలతో పాటు నజరానా కింద పైసలిస్తుండటంతో కిందిస్థాయి సిబ్బంది సైతం అతనికి జీ హుజూర్ అంటున్నారు.

ప్రయివేటు వర్కరుపై చేయి చేసుకున్న కాంట్రాక్టర్

కరెంటు పని చేసే ఓ ప్రయివేటు వర్కర్‌పై కాంట్రాక్టర్ దేవరాజు చేయి చేసుకున్నాడు. కణేకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఈ మేరకు బాధితుడు శ్రీరాములు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యర్రగుంట లైన్ బ్రేక్‌డౌన్ కావడంతో పనులు ముగించుకుని సబ్‌స్టేషన్‌కు రాగా.. ఇక్కడ నీకేం పనిరా అంటూ దాడి చేశాడని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

కాంట్రాక్టరును తప్పించండి : విప్ కాపు

కణేకల్లు సబ్‌స్టేషన్ పరిధిలో హెచ్‌వీడీఎస్ పనులు చేస్తున్న కాంట్రాక్టరు రైతులతో ఇష్టానుసారంగా డబ్బు వసూలు చేసి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాడని, అతన్ని వెంటనే తప్పించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఆదివారం విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సురేంద్రబాబును ఫోన్‌లో ఆదేశించారు. హెచ్‌వీడీఎస్ కింద ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను బిగించడానికి కాంట్రాక్టర్ రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని వేలాది రూపాయలు వసూలు చేస్తున్నాడంటూ ఎస్‌ఈ దృష్టికి తీసుకెళ్లారు. అతన్ని తప్పించని పక్షంలో సీఎండీకి ఫిర్యాదు చేయాల్సి ఉంటుందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను బిగించడానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తోందని, కావున రైతులెవరూ కాంట్రాక్టరుకు పైసా కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా డబ్బు డిమాండ్ చేస్తే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) టోల్ ఫ్రీ నంబర్ 14400కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆర్టీసీలో మోనార్క్

- ఎవరి మాటా వినడు
- హడలెత్తుతున్న అధికారులు
- ఆయన ముందు ఎవరైనా నిల్చోవాల్సిందే
- ఉన్నతాధికారి శైలితో విస్తుపోతున్న అధికారులు



అనంతపురం సెంట్రల్: ఆర్టీసీలో ఓ ఉన్నతాధికారి మోనార్క్‌లా వ్యవహరిస్తున్నారు. ఏ స్థాయి అధికారి అయినా తన ఎదురుగా కూర్చోరాదు. నిల్చుని ఉండాల్సిందే. ఎవ్వరి మాటా వినరు. ఆయన నియంతృత్వ పోకడతో అధికారులు, కార్మికులు హడలెత్తిపోతున్నారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగిన శాఖల్లో ఆర్టీసీ ముఖ్యమైనది. రోజూ లక్షలాది మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. జిల్లాలో 2,132 మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. ఉద్యోగులను సమన్వయం చేసుకోవడం.. సంస్థను అభివృద్ధి చేయడం.. ఆదాయం తీసుకురావడం అనేది ఉన్నతాధికారికి కత్తిమీద సాములాంటిదే. కండక్టర్ స్థాయి నుంచి డిపోమేనేజర్, ఆపై స్థాయి అధికారులందరూ కలసికట్టుగా పనిచేస్తేనే సంస్థ అభివృద్ధి పథంలో పయనిస్తుంది. కానీ ఆర్టీసీలో అసలు సమస్య ఉన్నతాధికారితోనే వస్తుండడం గమనార్హం.

అధికారులంటే చిన్నచూపు..

కలెక్టర్, ఎస్పీ సైతం సామాన్య ప్రజలను ఎదురుగా కుర్చీల్లో కూర్చోబెట్టి వారి సమస్యలను వింటారు. కానీ ఆర్టీసీలో డిపోమేనేజర్, ఆపైస్థాయి అధికారులైనా సరే నిలబడి మాట్లాడాల్సిందే. ఇక సామాన్య ప్రజలు ఆయన చాంబర్‌లోకి అడుగు కూడా పెట్టలేని పరిస్థితి. ముందునుంచి అదే పంథాలోనే వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు తెలిపారు. సమీక్షా సమావేశాల్లో కూడా అదే విధంగానే వ్యవహరిస్తున్నారు. కిందిస్థాయి సిబ్బంది ఎదురుగా లేదా పక్కన కూర్చుంటే ఏమాత్రం సహించలేరన్న ఆరోపణలు ఉన్నాయి.

పర్యవేక్షణ శూన్యం..

జిల్లాలో ఏడు డిపోల పర్యవేక్షణ బాధ్యత ఆయనపై ఉంటుంది. బస్సుల నిర్వహణ, బస్టాండ్లలో పరిశుభ్రత, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పన, సంస్థకు ఆదాయం తీసుకురావడం ప్రాధాన్యతా అంశాలుగా పెట్టుకుని పనిచేయాల్సి ఉంటుంది. కానీ సదరు అధికారి ఇవేవీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి రోజూ సగటున 40 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. కానీ పరిశుభ్రత విషయంలో దారుణంగా ఉండటంతో ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గత కొద్దిరోజులుగా సమీక్షలు జరుపుతూనే ఉన్నారు. అయినా ఆ ఉన్నతాధికారి పరిశుభ్రత అంశం తనకు సంబంధం లేదన్నట్టుగా ఉంటున్నారు. ఆదర్శంగా ఉండాల్సిన జిల్లా కేంద్రం బస్టాండ్ పరిస్థితే ఇలా ఉంటే ఇతర బస్టాండ్‌ల పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నెలకోసారి కూడా బస్టాండ్లను తనిఖీ చేయడం లేదని, దీంతో కాంట్రాక్టర్లు, ఇతర అధికారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అభ్యసనతోనే విజయం సొంతం

- 900 గ్రూప్‌–2 ఉద్యోగాల భర్తీకి జగన్‌ సర్కార్‌ చర్యలు
- పోటీ పరీక్షల్లో రాణించాలంటే సృజనాత్మకత ముఖ్యం
- ఆర్‌సీ ఎగ్జామ్స్‌ వంటి ఉత్తమ కోచింగ్‌ సెంటర్లను ఎంపిక చేసుకోవాలి
- సాక్షి మీడియా గ్రూపు, ఆర్‌సీ ఎగ్జామ్స్‌ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గ్రూప్‌–2 ఉద్యోగాల పోటీ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సులో ఎంపీ తలారి రంగయ్య


మాట్లాడుతున్న ఎంపీ తలారి రంగయ్య


ప్రతిభ చాటిన అభ్యర్థికి స్టడీ మెటీరియల్‌ అందిస్తున్న నిర్వాహకులు

అనంతపురం: పోటీ పరీక్షల్లో నెగ్గాలంటే సృజనాత్మకతతో కూడిన అభ్యసన అవసరమని, మనకంటూ ప్రత్యేకమైన ప్రణాళికను రూపొందించుకున్నప్పుడే విజయం సొంతమవుతుందని గ్రూప్‌ –2 పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అనంతపురం ఎంపీ తలారి రంగయ్య సూచించారు. రాష్ట్రంలో భారీ ఎత్తున గ్రూప్‌–2 ఉద్యోగాల భర్తీకి జగన్‌ సర్కార్‌ చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిద్దాలనే లక్ష్యంతో సాక్షి మీడియా గ్రూపు, ఆర్‌సీ ఎగ్జామ్స్‌ సంస్థ సంయుక్తంగా గ్రూప్‌–2 పోటీ పరీక్షలపై అనంతపురంలోని అంబేడ్కర్‌ కన్వెన్షన్‌ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎంపీ రంగయ్య హాజరై, మాట్లాడారు.

గ్రూప్‌–1, గ్రూప్‌–2 సాధనకు ప్రణాళికాబద్ధమైన అభ్యసనమే ప్రధానమన్నారు. కరెంట్‌ అఫైర్స్‌, జనరల్‌ నాలెడ్జ్‌తో పాటు సబ్జెక్టుపై ఎక్కువ ఫోకస్‌ ఉన్నప్పుడు మెరుగైన మార్కులు సాధించవచ్చునన్నారు. తాను ఆ స్థాయి నుంచే వచ్చానని గుర్తు చేశారు. ఉద్యోగ సాధనకు డబ్బు కీలకం కాదని, ఉన్నత విద్యతో పాటు తెలివితేటలు ఉంటే చాలన్నారు. ఒకే దఫా 1.40 లక్షల గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇవే కాకుండా తాజాగా 900 గ్రూప్‌–2, 100 గ్రూప్‌–1 పోస్టులకు నోటిఫికేషన్‌ జారీకి ఆమోదం తెలిపారన్నారు. అత్యంత ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన సీఎంగా దేశ చరిత్రలో వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక చోటు దక్కిందన్నారు. ఆర్‌సీ ఎగ్జామ్స్‌ చైర్మన్‌ మెండెం కిరణ్‌ కుమార్‌ మాట్లాడుతూ జూలై మొదటి వారంలో హైదరాబాద్‌ అశోక్‌ నగరులో ఏపీ గ్రూప్‌–2 తెలుగు, ఇంగ్లిష్‌ మీడియం బ్యాచులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 8985094499 ఫోన్‌ నంబరులో సంప్రదించి అడ్మిషన్‌ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 'సాక్షి' అనంతపురం బ్రాంచ్‌ మేనేజర్‌ శ్రీకాంత్‌, ఈవెంట్‌ మేనేజర్‌ చంద్ర, యాడ్స్‌ టీం లీడర్‌ శ్రీనివాసులు, ఆర్‌సీ ఎగ్జామ్స్‌ సంస్థ లెజెండరీ ఫ్యాకల్టీ బి. కృష్ణారెడ్డి (పాలిటీ), అబ్దుల్‌ కరీం (హిస్టరీ), సి.హరికృష్ణ (సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ), ఎండీ పాషా (ఎకానమీ), వందలాది మంది అభ్యర్థులు పాల్గొన్నారు. సదస్సులో టాలెంట్‌ టెస్ట్‌ నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్‌ అందజేశారు.


సదస్సుకు హాజరైన అభ్యర్థులు

మార్పు కోరుకోవాలి



ఇదే అంబేడ్కర్‌ భవన్‌ ఎదురుగా ఉండే చిన్న గదిలో ఉంటూ డిగ్రీ వరకూ చదువుకుని, ఎస్కేయూలో పీజీ పూర్తి చేసి, పీహెచ్‌డీ అందుకున్నా. జీవితంలో మార్పు కోరుకోకపోతే విఫలం అవుతాం. గ్రూప్‌–2 నోటిఫికేషన్‌ రావడం తథ్యం. ఫలితం అనుకూలమా? ప్రతికూలమా? అని పక్కనబెట్టి అంకితభావంతో కృషి చేస్తే విజయం సొంతమవుతుంది.

– బి.కృష్ణారెడ్డి, పాలిటీ ఫ్యాకల్టీ

సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ కీలకం



సన్నద్ధమవుతున్న పరీక్షకు సంబంధించిన సిలబస్‌ మీద పూర్తి అవగాహన ఉండాలి . ఒక్కో టాపిక్‌కు ఎన్ని మార్కులు వస్తాయనే విషయమూ కీలకమే. సమయాన్ని వినియోగించుకోవాలి. మనకు నచ్చిన అంశానికే కాకుండా అన్నింటికీ సమ ప్రాధాన్యత ఇస్తేనే ఎక్కువ మార్కులు సాధించగలం. ముఖ్యంగా సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ సబ్జెక్టును కరెంట్‌ అఫైర్స్‌లో భాగంగానే పరిగణించాలి. ఇస్రో పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలు, ఉపగ్రహ ప్రయోగాలు వంటి అంశాలపై దృష్టి కేంద్రీకరించాలి. – సి.హరికృష్ణ, సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ ఫ్యాకల్టీ

బేసిక్‌ అంశాలపై పట్టుండాలి



గ్రూప్‌–2 ఎకానమీకి గతంలో 150 మార్కులు ఉండేవి. తాజాగా 75 మార్కులకు కుదించారు. సిలబస్‌లో ఉన్న అంశాలపై నేరుగా ప్రశ్నలు ఉండవు. అప్లైడ్‌ విధానంలోనే ప్రశ్నలు అడుగుతారు. వాటిని బట్టే సమాధానం గుర్తించగలిగే సామర్థ్యముండాలి. బేసిక్‌ అంశాలపై పట్టు సాధించినప్పుడే ఇది సాధ్యమవుతుంది. వచ్చే 5, 6 నెలలు అభ్యసనంపైనే దృష్టి కేంద్రీకరిస్తే కచ్చితంగా విజయం సాధించవచ్చు. – డీఎం పాషా, ఎకానమీ ఫ్యాకల్టీ

చదవడమే ముఖ్యం



పోటీ పరీక్షల్లో రాణించాలంటే ముఖ్యంగా చదవడం మొదలుపెట్టాలి. పేపర్‌–1లో జనరల్‌ స్టడీస్‌ , పేపర్‌–2లో సెక్షన్‌–1 ఏపీ సామాజిక , సాంస్కృతిక చరిత్ర అంశంపై ప్రశ్నలు ఉంటాయి. ప్రిలిమ్స్‌లోనూ ఈ అంశాలకు సంబంధించిన ప్రశ్నలే ఉంటాయి. ప్రిలిమ్స్‌కు సిద్ధమైతే మెయిన్స్‌కూ ప్రిపరైనట్లే. – డాక్టర్‌ ఎం, అబ్దుల్‌ కరీం (హిస్టరీ ఫ్యాకల్టీ)

వ్యూహ రచనకు దోహదం



గ్రూప్‌–2 ఉద్యోగం సాధించాలంటే ఎలాంటి వ్యూహాలను అనుసరించాలో తెలిసింది. ఏయే సబ్జెక్టులపై ఎలా ఫోకస్‌ చేయాలనే అంశాలపై స్పష్టత వచ్చింది. ప్రిలిమినరీ, మెయిన్స్‌ రెండింటికీ ఒకే దఫా ఎలా సన్నద్ధం కావాలనే అంశంపై అంచనా ఏర్పరచుకున్నాను.

– అఫ్రీన్‌, గ్రూప్‌–2 అభ్యర్థి

నమ్మకం కలిగింది



సదస్సులో పాల్గొనడం ద్వారా స్వీయ అభ్యసనతో ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం కలిగింది. మన మీద మనకు నమ్మకం పెంపొందించుకుంటూ పోటీ పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలో వివరించడం చాలా బాగుంది.

– రాజశేఖర్‌రెడ్డి, గ్రూప్‌–2 అభ్యర్థి

లక్ష్యం నిర్దేశించుకున్నా



సదస్సు ద్వారా ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా. ఎలా సన్నద్ధం కావాలనే అంశంపై అవగాహన కలిగింది. బేసిక్స్‌ అంశాలపై పట్టు ఎలా సాధించాలో వివరించిన తీరు చాలా బాగుంది.

– నీరజ, గ్రూప్‌–2 అభ్యర్థి

ధైర్యం వచ్చింది



పోటీ పరీక్షలంటే ఇప్పటి వరకూ ఒక విధమైన భయం ఉండేది. చాలా మంది పోటీ పడతారు, మనం సాధించగలమా అనే అపనమ్మకం ఉండేది. అవగాహన సదస్సుతో ఈ అపనమ్మకం కాస్త దూరమైంది. పరీక్షల్లో టాపర్‌గా నిలవడానికి ఎలాంటి వ్యూహాలను అనుసరించాలో చక్కగా వివరించారు. దీంతో నాకు ధైర్యం వచ్చింది.

– అనీలా, గ్రూప్‌–2 అభ్యర్థి

నేటి నుంచి ఎర్రితాత స్వామి ఆరాధనోత్సవాలు


స్వామి మహాసమాధి

బొమ్మనహాళ్‌: ఆధ్యాత్మిక బోధనలు చేస్తూ దాదాపు తొమ్మిది దశాబ్దాల క్రితం కర్ణాటక నుంచి బొమ్మనహాళ్‌కు చేరుకున్న అవధూత ఎర్రితాత స్వామి ఆరాధనోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లున్న 1936లో స్థానిక శాంతిధామంలోనే భక్తుల సమక్షంలో జీవసమాధి పొందారు. సోమవారం ఉదయం గణపతి పూజ, గోపూజ, కలశస్థాపన, గంగపూజ, ధ్వజారోహణంతో ఆరాధనోత్సవాలకు నాందీ పూజ నిర్వహించనున్నారు. రాత్రికి నంది వాహన సేవ ఉంటుంది. మంగళవారం ఉదయం మహాగణపతి పూజ, సహస్ర మూలికా పంచామృతాభిషేకం, బిల్వార్చన, పల్లకీసేవ, సాయంత్రం శేషతల్ప అలంకరణలు, రాత్రి 10 గంటలకు స్వామివారి ప్రభ ఉత్సవం ఉంటాయి. బుధవారం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, మహామంగళ హారతి, ఛత్రప్రభ అలంకారం, ఉట్లపరుష, రాత్రికి భజనలు, కోలాట కార్యక్రమాలు ఉంటాయి.

12న విత్తన మహోత్సవం

బుక్కరాయసముద్రం: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులో ఈ నెల 12న విత్తన మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్‌, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌ మల్లేశ్వరి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సదస్సుకు రైతులు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. అలాగే మేలైన విత్తనాల ప్రదర్శన, విక్రయాలు ఉంటాయని పేర్కొన్నారు.

నగరంలో చైన్‌ స్నాచింగ్‌


వివాహిత మెడలో గొలుసు లాగేస్తున్న దుండగుడు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్‌: జిల్లా కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున ఓదుండగుడు చైన్‌ స్నాచింగ్‌కు తెగబడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని ఎంకేఎం ఫంక్షన్‌ హాల్‌ సమీపంలో నివాసముంటున్న సీవీ రమణ, శాంతమ్మ దంపతులు ఆదివారం ఉదయం 6.30 గంటలకు మార్నింగ్‌ వాక్‌ బయలుదేరారు. కాసేపటి తర్వాత భార్య నెమ్మదిగా నడుస్తుంటే భర్త కాస్త ముందుకెళ్లాడు. అప్పటికే వారిని అనుసరిస్తున్న ఓ యువకుడు శాంతమ్మ వెనకకు చేరి ఆమె మెడలోని బంగారు గొలుసు లాగేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో ఆమె కేకలు వేయడంతో కిందకు నెట్టేసి, బంగారు గొలుసు లాక్కొని, తన ద్విచక్ర వాహనంపై ఉడాయించాడు. రమణ వెనక్కు వచ్చేలోపు ఆగంతకుడు మాయమయ్యాడు. ఘటనపై నాల్గో పట్టణ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఆధారంగా పుటేజీలను సేకరించి, దర్యాప్తు చేపట్టారు.

చంద్రబాబుకు ఓటమి భయం

- సొంతంగా పోటీ చేసి గెలిచే సత్తా లేదు
- 2024 ఎన్నికల్లో టీడీపీకి రాజకీయ సమాధి తప్పదు
- 175కు 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం
- ప్రభుత్వ విప్‌ కాపు రామచంద్రారెడ్డి



రాయదుర్గం: ఎన్నికలకు ఏడాది గడువు ఉండగానే టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును ఓటమి భయం వెన్నాడుతోందని ప్రభుత్వ విప్‌ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక ఆయన స్వగృహంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయాల్లో 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకుంటున్న చంద్రబాబు ఏనాడూ సొంతంగా పోటీ చేసి గెలిచిన దాఖలాలు లేవన్నారు. దీంతో ఓ వైపు జనసేనతో పొత్త పెట్టుకుని మరో వైపు బీజేపీకి చేరువయ్యేందుకు ఉసరవెల్లి రాజకీయాలకు తెరలేపారన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా 2024 ఎన్నికల్లో 175కు 175 స్థానాల్లో వైఎస్సార్‌ సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా టీడీపీకి రాజకీయ సమాధి కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కర్ణాటకలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలోని కొన్ని అంశాలతో పాటు జగన్‌ సర్కార్‌ అమలు చేస్తున్న పథకాలకు పేరు మార్పు చేసి మహానాడు వేదికగా చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో ప్రజల్లో నవ్వులపాలైందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజాదరణను చూసి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు జీర్ణించుకోలేక పోతున్నారని మండిపడ్డారు. మంత్రిగా ఉన్న కాలంలో నియోజకవర్గ అభివృద్ధిని పక్కన బెట్టి అడ్డంగా దోచుకున్నారని విమర్శించారు. సంపూర్ణ రుణమాఫీ పేరుతో రైతులను, డ్వాక్రా మహిళలను దగా చేసిన నీచ చరిత్ర టీడీపీదన్నారు. కులానికో కల్యాణమంటపం పేరుతో శంకుస్థాపనలు చేసి వంచనకు గురిచేసిన ఘనత కాలవదన్నారు. ప్రతి గ్రామానికి తారురోడ్డు, సీసీ రోడ్డు వేయిస్తానని చెప్పి మోసం చేశారన్నారు. వ్యవసాయానికి రూ.5వేల కోట్ల ధరల స్థిరీకరణ, రూ.2కే ప్రతి ఇంటికీ 20 లీటర్ల ప్యూరిఫైడ్‌ నీరిస్తామని, ఇంటికో ఉద్యోగం, విద్యార్థులకు ఐప్యాడ్లు, కురుబలను ఎస్టీలోకి, మేదరలను, రజకులను, ఆరే కటికలను, దళిత క్రిష్టియన్లను ఎస్సీల్లోకి, ఉప్పరలను, పూసలోళ్లను బీసీ–ఏ లోకి మారుస్తామని, ఇస్లామిక్‌ బ్యాంకింగ్‌ విధానం ద్వారా ముస్లిలకు వడ్డీ లేకుండా రూ.5 లక్షల రుణాల మంజూరని, కాపుల సంక్షేమానికి రూ.5వేల కోట్లు కేటాయిస్తామని అన్ని వర్గాలను మోసం చేసిన తీరును ప్రజలు మరిచిపోలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ ప్రజల బాగోగులు పట్టించుకోని వారికి తన గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఇప్పటికైనా దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు


విద్యార్థికి అవార్డు అందజేస్తున్న ప్రముఖులు

అనంతపురం: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని అనంతపురం నగర డిప్యూటీ మేయర్‌ వాసంతి సాహిత్య అన్నారు. పదో తరగతిలో 550, ఆపై మార్కులు సాధించిన బలిజ సామాజిక విద్యార్థులకు అనంతపురంలోని బాలాజీ కల్యాణమంటపం వేదికగా రాయలసీమ బలిజ మహా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్‌ వాసంతి సాహిత్య హాజరై 92 మంది విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. చదువు, సత్ప్రవర్తన, క్రమశిక్షణ మనిషి ఎదుగుదలకు తోడ్పతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాయలసీమ బలిజ మహా సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు బళ్లారి వెంకట్రాముడు, పున్నం విజయభాస్కర్‌, జీవీ రమణ, శ్రీనివాసులు, రామకృష్ణ, నాగేంద్ర, రవికుమార్‌, కోనేటి సాయి ప్రసాద్‌, రమేష్‌, పవన్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై వేధింపుల కేసు నమోదు


హిందూపురం: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన కానిస్టేబుల్‌, అతని కుటుంబసభ్యులపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురానికిచెందిన శిరీషాకు ఎనిమిదేళ్ల క్రితం హిందూపురంలోని డీఆర్‌ కాలనీలో నివాసముంటున్న కానిస్టేబుల్‌ సురేష్‌తో వివాహమైంది. ప్రస్తుతం వీరికి ఆరేళ్ల వయసున్న పాప ఉంది. పెళ్లి సమయంలో భారీగా కట్నం, పెద్ద ఎత్తున బంగారాన్ని శిరీష తల్లిదండ్రులు అందజేశారు. హిందూపురంలోని రెండో పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా సురేష్‌ పనిచేస్తున్నాడు. ఇటీవల మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్న సురేష్‌ను భార్య నిలదీయడంతో ఆమెపై వేధింపులు మొదలయ్యాయి. అదనపు కట్నం కావాలని సురేష్‌తో పాటు అతని తల్లి అక్కమ్మ, చెల్లెలు సుశీల, తమ్ముడు రమేష్‌ వేధించడం మొదలు పెట్టారు. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో చివరకు భర్త పనిచేస్తున్న పోలీస్‌స్టేషన్‌లోనే బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, తన ఇంట్లోకి భార్య శిరీష కుటుంబసభ్యులు చొరబడి తనపై దాడి చేశారంటూ సురేష్‌ ఇచ్చిన ఫిర్యాదుపై కూడా కేసు నమోదు చేశారు.

పట్టుబడ్డ గుప్త నిధుల వేటగాళ్లు


పట్టుబడిన నిందితులు వీరే

గుత్తి: చరిత్రాత్మకమైన గుత్తి కొండపై గుప్త నిధుల కోసం తవ్వకాలు సాగిస్తున్న ఆరుగురిని పురావస్తు శాఖ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలు... దాదాపు పది మంది గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం ఉదయం గుత్తి కొండపై గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. అదే సమయంలో కొండపై తనిఖీలు చేపట్టిన పురావస్తు శాఖ సిబ్బంది కృష్ణ చైతన్య, ఆంజనేయులు అక్కడకు చేరుకుని ఆరుగురిని పట్టుకున్నారు. నలుగురు పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని గుప్త నిధుల వేటగాళ్లను అదుపులోకి తీసుకుని పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. నిందితులను విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శాంతినారాయణకు కుప్పం రెడ్డమ్మ పురస్కారం



అనంతపురం కల్చరల్‌: జిల్లాకు చెందిన నవల, కథారచయిత డాక్టర్‌ శాంతి నారాయణకు మరో అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్టాత్మక కుప్పం రెడ్డమ్మ సాహితీపురస్కారానికి ఆయన రచించిన 'ముడి' నవల ఎంపికైంది. ఈ మేరకు నిర్వాహకులు డాక్టర్‌ రామలక్ష్మి ఆదివారం వెల్లడించారు. స్త్రీల ఆత్మ గౌరవానికి ప్రతీకగా రచించిన ఈ నవల ఇప్పటికే ఎంతో మందిని ప్రభావితం చేసింది. పోటీకి అందిన మొత్తం 25 నవలల్లో శాంతినారాయణ నవల ఎంపిక కావడంపై పలువురు సాహితీ వేత్తలు ఆయనను అభినందించారు. ఈ నెల 12న చిత్తూరులో జరిగే సాహిత్య సభలో ఆయన పురస్కారం అందుకోనున్నారు.

విషపు నీరు తాగి గొర్రెల మృతి


మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న స్థానికులు

బ్రహ్మసముద్రం: మండలంలోని నాగిరెడ్డిపల్లిలో విషపు ద్రావణం కలిపిన నీరు తాగి రైతు సోమశేఖర్‌కు చెందిన 20 గొర్రెలు మృతి చెందాయి. బాధిత రైతు తెలిపిన మేరకు... తనకున్న 30 గొర్రెలను ఆదివారం ఉదయం వ్యవసాయ పొలాల్లోకి మేపునకు తీసుకెళ్లాడు. టమాట పంటకు పిచికారీ చేసేందుకు మందు కలిపిన నీరు తాగి 20 గొర్రెలు అక్కడిక్కడే మృతి చెందాయి. సమాచారం అందుకున్న పశువైద్యాధికారి డాక్టర్‌ సూర్యనారాయణరెడ్డి అక్కడకు చేరుకుని గొర్రెల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కన్వీనర్, యూత్ కన్వీనర్ల నియామకం


కన్వీనర్ బాలపోతన్న


యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా సిద్దరాంపురానికి చెందిన కురుబ బాలపోతన్న, యూత్ మండల కన్వీనర్‌గా ఆత్మకూరుకు చెందిన గూలి కొండారెడ్డిని నియమించారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

216 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు

అనంతపురం కల్చరల్: లయన్స్‌క్లబ్ అనంతపురం మెయిన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 216 మందికి ఉచిత ఆపరేషన్లు చేయిస్తున్నట్లు నిర్వాహకులు లక్ష్మీనారాయణ, అసీఫుద్దీన్, నబీరసూల్ తెలిపారు. స్థానిక గిల్డ్ ఆఫ్ సర్వీసు పాఠశాలలో ఉదయం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఆర్ట్స్ కాలేజీ నుంచి స్వచ్ఛందంగా వచ్చిన వలంటీర్లకు ఉమామహేశ్వరి, ప్రముఖ ఐ స్పెషలిస్టు డాక్టర్ హెనల్ వైద్య బృందాలు పరీక్షలు చేశారు.

11 నుంచి మున్సిపల్ కార్మిక సంఘం మహాసభలు


మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: మున్సిపల్ కార్మిక సంఘం జాతీయ మహాసభలు ఈనెల 11 నుంచి 13 వరకు ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరగనున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌గౌడ్ తెలిపారు. ఆదివారం సంఘం కార్యాలయంలో మహాసభల పోస్టర్లు, కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజేష్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సఫాయి కర్మచారి బోర్డులోని సభ్యులు పర్యటనలకే పరిమితం అయ్యారే తప్ప కార్మికులు సమస్యలను పట్టించుకోలేదన్నారు. కార్మికుల సమస్యలపై జాతీయ మహాసభల్లో విస్తృతంగా చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు శివకృష్ణ, తిరుమలయ్య, మాధవ, ఎర్రప్ప, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10:30 గంటలకు స్పందన కార్యక్రమం ఉంటుందని కమిషనర్ రమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు సమస్యలు ఏమైనా ఉంటే స్పందనలో తెలియజేయాలని కమిషనర్ తెలిపారు.

టీటీడీ ఆధ్వర్యంలో సత్యదేవుడి వ్రతాలు


మూడోరోడ్డులో పూజలందుకున్న సత్యదేవుడు

అనంతపురం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానాలు హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా జరిగాయి. నగరంలోని ఉమానగర్‌లో కొలువైన ప్రాచీన దత్తాత్రేయస్వామి ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తులు వ్రతమాచరించారు. టీటీడీ తరఫున పండిట్ వేణు, ఆలయ కమిటీ మేనేజర్ అప్పా సుధీర్ మాట్లాడుతూ టీటీడీ పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో టీటీడీ సిబ్బంది సుధామణి, వరప్రసాద్ పాల్గొన్నారు. అలాగే మూడోరోడ్డులోని బాబా మందిరంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరిగాయి.

స్విమ్మింగ్ సౌర..దీపక్

చేరుకోవాలనే తపన ఉండాలేగానీ గమ్యం ఎంత దూరం ఉన్నా మార్గం సునాయాసమవుతుందని తల్లి ప్రేరణ ఇచ్చింది.. సంకల్పం ఉండాలేగానీ అసాధ్యం అనుకున్నదేదైనా సుసాధ్యమవుతుందని తండ్రి ప్రోత్సహించాడు.. పతకాలెన్ని సాధించినా మొదటి విజయమే పదిలమవుతుందని గురువులు నేర్పారు.. మొక్కవోని దీక్ష విజయ తీరాలకు చేరుస్తుందని తల్లి, తండ్రి, గురువులు నూరిపోశారు.. ఆ నేర్పుతో ఈత కొలనులో దిగాడంటే అతనికి కొలమానాలు ఉండవు.. 'గట్టు' ఎక్కడంపైనే గురి పెట్టడం అలవర్చుకున్నాడు. ప్రతి పోటీలోనూ విజేతగా నిలిచి, పతకాల పంట పండిస్తూ.. 'అనంత' నుంచి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు అనంతపురానికి చెందిన దీపక్.


స్విమ్మింగ్ చేస్తున్న దీపక్

అనంతపురం: అనంతపురానికి చెందిన ఉమాదేవి, గణేష్‌బాబు దంపతుల కుమారుడు దీపక్. చిన్ననాటి నుంచి చదువుతో పాటు క్రీడలపైనా మక్కువ పెంచుకున్నాడు. అతని ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ వచ్చారు. కరాటే, డ్యాన్స్, సంగీతం తదితర అంశాల్లోనూ ప్రతిభ ఉన్నా.. ఈత అంటే అతనికి మరింత ఇష్టం. నిరంతర సాధనతో విజయ తీరాలు చేరుతున్నాడు. అతనికున్న ప్రతిభకు పతకాలు వరిస్తున్నాయి. జూలై 31 నుంచి ఆగస్టు 6 వరకు దుబాయ్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. భారత్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గతంలో జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో మూడు బంగారు పతకాలు, ఒక వెండి పతకం సాధించాడు. 50 మీటర్ల స్విమ్మింగ్ పోటీల్లో రెండు , 200 మీటర్ల స్విమ్మింగ్ పోటీలో బంగారు పతకం సాధించాడు. 100 మీటర్ల స్విమ్మింగ్ పోటీల్లో రెండో స్థానం (కాంస్య పతకం) సాధించాడు. న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లోనూ పాల్గొన్నాడు.

11 ఏళ్ల పాటు నిరంతర కృషి


సాధించిన పతకాలతో దీపక్

11 ఏళ్ల నిరంతర కృషే నన్ను ఈ స్థాయికి చేర్చింది. అనంతపురంలోని భైరవనగర్‌లో 2012లో స్విమ్మర్ గంగాధర్ వద్ద ఈతలో మెలకువలు నేర్చుకున్నా. 2014లో స్కూల్ గేమ్స్‌లో సత్తాచాటా. జాతీయ స్థాయి పోటీల్లోనూ అర్హత సాధించా. ఈతలో ఉత్తం, రాజశేఖర్ , రంగయ్య మెలకువలు నేర్పారు. అనంతపురం జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రోత్సహిస్తోంది.

– దీపక్ , స్విమ్మర్

ఆకట్టుకున్న స్వర నీరాజనం

అనంతపురం కల్చరల్: గాన గాంధర్వుడు ఎస్పీబీకి గాయనీ గాయకులు స్వరనీరాజనాలర్పించారు. ఆదివారం బాలసుబ్రమణ్యం జయంతి సందర్భంగా ఘంటసాల ఆరాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక మూడో రోడ్డులో స్వరనీరాజనం కార్యక్రమం ఘనంగా జరిగింది. సంస్థ వ్యవస్థాపకులు పాలసముద్రం నాగరాజు నేతృత్వంలో అధిక సంఖ్యలో జిల్లా గాయనీ గాయకులు ఆ పాత మధురాలతో అలరించారు. నాగరాజు, కేవీ మహీధర్, ఆచార్య సుధాకరబాబు, శ్రీదేవి, బృంద, విజయలక్ష్మి, లక్ష్మీనారాయణ, పద్మజ తదితరులు బాలసుబ్రమణ్యం ఆలపించిన పాటలను అద్భుతంగా పాడి నివాళులర్పించారు. చిన్మయా మిషన్ స్వామీ ఆత్మవిదానంద సరస్వతి, ఘంటసాల రామయ్య, పాలసముద్రం నాగరాజు తదితరులు ఎస్పీ బాలసుబ్రమణ్యం తెలుగు వారికి విశేష ఖ్యాతిని తెచ్చిపెట్టారని గుర్తు చేసుకున్నారు.

అలరించిన సంగీత విభావరి

అనంతపురం కల్చరల్: స్థానిక అనంతపురం క్లబ్ ప్రాంగణంలో ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం


పాటలు పాడుతున్న గాయనీగాయకులు

జయంతి వేడుకలు ఆదివారం రాత్రి వీనుల విందుగా జరిగాయి. ఎస్పీ బాలసుబ్రమణ్యం సినీరంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని డీఈవో ఎం.సాయిరాం తెలిపారు. పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి అధ్యక్షుడు సురేష్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఆదినారాయణ, కేశవ, మారుతీప్రసాద్, శ్రీదేవి, జ్యోతి తదితరులు పాతపాటలు పాడారు. ముఖ్యఅతిథులుగా హాజరైన డీఈవో సాయిరాం, అనంతపురం క్లబ్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, రవికాంత్ రమణ తదితరులను నిర్వాహకులు సన్మానించారు.

పర్యావరణ హితమే అభిమతం కావాలి

అనంతపురం: పర్యావరణ హితమే మానవాళి అభిమతం కావాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.నాగభూషణ రాజు అన్నారు. ఎస్కేయూ క్యాంపస్‌లో అడ్వెంట్ గ్లోబల్ సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ కంపెనీ వైస్ చైర్మన్ దామోదర్ (డీజే) నేతృత్వంలో రెండు కిలో మీటర్ల వాక్‌థాన్ నిర్వహించారు. పర్యావరణ హిత జీవన శైలి అలవర్చుకోవాలని నినాదాలు చేశారు. ఎస్కేయూ ఆది ఫౌండేషన్ నుంచి అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం వరకు వాక్‌థాన్ చేశారు. అంతకు ముందు ఆది ఫౌండేషన్‌లో మొక్కలు నాటారు. ఫార్చ్యూన్-500 జాబితాలో చోటు దక్కించుకున్న అడ్వెంట్ గ్లోబల్ సొల్యూషన్స్ కంపెనీ ఎస్కేయూలో సాఫ్ట్‌వేర్ సేవలు అందిస్తూ విద్యార్థులకు కొలువులు కల్పిస్తోందన్నారు. డిస్కవరీ అనంత అనిల్‌కుమార్ రెడ్డి, డాక్టర్ చంద్రమౌళి, అడ్వెంట్ గ్లోబల్ సొల్యుషన్స్ మేనేజర్ గాయత్రి, రియాజ్, శ్వేత, జైకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


వాక్‌థాన్ ప్రారంభిస్తున్న అడ్వెంట్ గ్లోబల్ ప్రతినిధులు

కమనీయం.. కల్యాణోత్సవం

పెద్దపప్పూరు: పవిత్ర అశ్వర్థనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా స్వామి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ఆలయ అర్చకులు బాలసుబ్రమణ్య శర్మ, సునీల్ కుమార్ శర్మ, సుధీర్ కుమార్ శర్మ ఉదయం నుంచి స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నారాయణస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను వధూవరులుగా పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. తర్వాత ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు.

సర్పరూపుడికి పంచామృతాభిషేకాలు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేకంగా పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, బంగారు కవచం ధరింపజేసి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున భక్తులు రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో సర్పరూపుడు

నేడు పర్యావరణ దినోత్సవ ర్యాలీ

అనంతపురం టౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయం 7గంటలకు తెలుగుతల్లి కూడలి నుంచి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ శంకర్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ర్యాలీ అనంతరం జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పాతూరు మార్కెట్ ఆవరణలో ఎనీటైమ్ బ్యాగ్‌ను అందజేసే యంత్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పర్యావరణంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించనున్నట్లు తెలిపారు.

ఉపాధిహామీ పనులపై నేడు సమావేశం

ఆత్మకూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 2022 – 2023 ఆర్థిక సంవత్సరంలో జరిగిన సామాజిక తనిఖీ, ఉపాధిహామీ పనులపై ఈనెల 5న మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీఓ సుజాత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది హాజరుకావాలన్నారు.

పొగాకు ఉత్పత్తులతో దుష్ప్రభావాలు

అనంతపురం క్రైం: సిగరెట్, పొగాకు ఉత్పత్తులతో దుష్ప్రభావాలు ఉంటాయని పీసీపీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని తపోవనంలోని ఓ క్రీడా మైదానంలో పొగాకు వినియోగంతో వచ్చే జబ్బులపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ గంగాధర్ రెడ్డి, డాక్టర్ మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

7న వలంటీర్లకు సన్మానం

ఆత్మకూరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7న వలంటీర్లకు సన్మానం ఉంటుందని ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వలంటీర్లను సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులతో సత్కరించనున్నట్లు తెలిపారు. మండలంలోని గ్రామ వలంటీర్లు , ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరుకావాలన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

అనంతపురం క్రైం: నగరంలోని నీరుగంటి వీధిలో కొప్పల మీనాక్షమ్మ ఫౌండేషన్, రవికాంత్ క్యాటరర్స్ సౌజన్యంతో ఆదివారం ఆదిత్య మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు రాజశేఖర్ స్వరూప్, అశ్వర్థ కుమార్, లీలావతి, వేణు బీపీ, షుగర్, తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం రవికాంత్ క్యాటరర్స్ నిర్వాహకులు రమణ మందులు పంపిణీ చేశారు.

విద్యార్థులతో కలిసి జేవీవీ నాయకుల ట్రెక్కింగ్


గుత్తి కోటకు ట్రెక్కింగ్ చేయడానికి వెళ్తున్న డిగ్రీ విద్యార్థులు, జేవీవీ నాయకులు

గుత్తి: చరిత్రాత్మకమైన గుత్తి కొండకు ఆదివారం రాయదుర్గం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులతో కలిసి జేవీవీ నాయకులు ట్రెక్కింగ్ నిర్వహించారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు చౌదరి విజయ భాస్కర్, కోట గైడ్ రమేష్ నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు చౌదరి విజయభాస్కర్ ట్రెక్కింగ్ చేసిన వారందరికీ అల్పాహారం, తేనేటి విందు ఏర్పాటు చేశారు. జేవీవీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రంగన్న, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, వెంకటరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మహేంద్రరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్, నాయకులు శ్రీధర్ గౌడ్, దేశాయి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గుత్తి కొండపై వెలిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు వందలాది మంది భక్తులు భోజనం చేశారు.

నేడు మొక్కలు నాటే కార్యక్రమం

బుక్కరాయసముద్రం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దరాంపురంలోని పోలీస్ హౌసింగ్ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ కంచి శ్రీనివాసరావుతోపాటు ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు.


1980- 81 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

ఆత్మకూరు: కంబదూరు మండలం తిమ్మాపురం జయం ఆదెప్ప సేవామందిర ఉన్నత పాఠశాలలో 1980–1981 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆత్మకూరులో ఆదివారం సమ్మేళనమయ్యారు. పూర్వ విద్యార్థి చెన్నారెడ్డి ఇంటి వద్ద వారంతా కలిశారు. సాయంత్రం వరకు సరదాగా గడిపారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఎవరు ఎక్కడ ఏస్థాయిలో ఉన్నా, ఏడాదికొకసారి ఇలా కలుసుకొని సరదాగా గడపడం ఆనందంగా ఉంటుందని పూర్వ విద్యార్థులు అన్నారు. అనంతరం ఒకరినొకరు సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు.

చిన్నారులు చదువుతోపాటు కళలు నేర్చుకోవాలి

అనంతపురం కల్చరల్: చిన్నారులు చదువుతో పాటు కళలు నేర్చుకోవాలని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి అన్నారు. కళాసాగర్ డాన్స్ అకాడమీ వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు ఆదివారం రాత్రి ఉత్సాహంగా సాగాయి. ఆటపాటలతో చిన్నారులు అదరగొట్టారు. సినీ, జానపద గీతాలతో డాన్స్‌మాస్టర్ కత్తి విజయ్ కుమార్ శిష్యులు స్థానిక కృష్ణకళామందిరం ఆడిటోరియాన్ని హోరెత్తించారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయ్‌భాస్కరరెడ్డి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామ లక్ష్మి, డాక్టర్ హరిప్రసాద్, ప్రముఖ సైకాలజిస్టు లహరి, సీనియర్ డాన్సు మాస్టర్లు పట్నం శివప్రసాద్, షణ్ముఖనాయుడు తదితరులు మాట్లాడారు. నాట్యాచార్యులు కత్తి విజయ్‌కుమార్ బహుముఖ ప్రజ్ఞాశాలిగా జిల్లా కళారంగానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం చిన్నారులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించారు. పలువురు డాన్సు మాస్టర్లు, టీవీ నటీనటులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించాలని కౌలు రైతుల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈనెల 12న విజయవాడ నుంచి మంగళగిరి వరకు చేపట్టిన కౌలు రైతుల పాదయాత్ర కరపత్రాలను విడుదల చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య మాట్లాడారు. కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు ప్రచార జాతాలు, సచివాలయాలు, తహసీల్దారు కార్యాలయల వద్ద వినతిపత్రాల సమర్పణ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లప్ప, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, నాగమణి, భాస్కర్, రామాంజనేయులు, నాగరాజు పాల్గొన్నారు.


పాదయాత్ర కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

సిబ్బంది వేతనాలపై డీఎంఈ ఆరా

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్, పారిశుధ్య కార్మికులకు అందుతున్న వేతనాలపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆరా తీసింది. ఆదివారం గత ఆరు నెలలుగా వీరికి అందుతున్న వేతనాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌ను వారు కోరారు. దీంతో ఆయా విభాగాల్లో విధులు పనిచేస్తున్న సిబ్బంది వేతనాల వివరాలను ఆఫీస్ కార్యాలయ సిబ్బంది డీఎంఈ కార్యాలయానికి పంపినట్లు సమాచారం.

టీచర్స్ కాలనీలో చోరీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న టీడీపీ నాయకుడు వెంకటప్ప ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు.. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు వ్యక్తిగత పనిపై ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం వచ్చి చూడగా, తలుపులు తీసి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించిన బాధిత కుటుంబం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇంట్లో ఉన్న బీరువాలను పరిశీలించారు. బీరువాలో ఉన్న నాలుగున్నర తులం బంగారు నగలు, రూ. 80 వేల నగదును ఎత్తుకెళ్లారు.

చెత్తను ఎప్పటికప్పుడు తరలించండి

అనంతపురం క్రైం: రోడ్లపై చెత్త కనిపించకుండా ఎప్పటికప్పుడు కంపోస్టు యార్డుకు తరలించాలని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి పారిశుధ్య కార్యదర్శులు, సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం నగరంలోని కమలానగర్, ఆర్టీసీ బస్టాండ్, శ్రీనివాస్‌నగర్, లక్ష్మీనగర్, కోవూర్‌నగర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. ఇంటింటా చెత్త సేకరణ పక్కాగా జరగాలన్నారు. క్లాప్ ఆటో సిబ్బంది చెత్తను సక్రమంగా తీసుకెళ్తున్నారో లేదో పరిశీలించారు. నగర ప్రజలు సైతం చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. లక్ష్మీనగర్‌లో జరుగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులపై ఏఈ శంకర్‌తో ఆరా తీశారు. నాణ్యత ప్రమాణాలతో రోడ్డు పనులు నిర్వహించేలా చూడాలన్నారు.

ఒకరికి గాయాలు

గార్లదిన్నె: ముంటిముడుగు కొత్తపల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. 108 సిబ్బంది వివరాల మేరకు.. కొప్పలకొండకు చెందిన తిమ్మప్ప కల్లూరు నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. కొత్తపల్లి సమీపంలో మలుపు వద్ద ఆటోను ఢీకొన్నాడు. ఘటనలో తిమ్మప్ప కాలు విరిగింది. స్థానికులు అతడిని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.